W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

17-5-2025





04

## బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

### ఇల్లందు డీఎస్పీ చంద్రబాను

బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఇల్లందు డీఎస్పీ ఎన్. చంద్రబాను అన్నారు. శుక్రవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం, హిందూ మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ చంద్రబాను కలిసి మాట్లాడారు.



## చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

- హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా చర్యలు
- గన్నీ బ్యాగ్ లు, టార్పాలిన్ కవర్లు అందుబాటు లో పెట్టాలి
- అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా ఉండాలి
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి

09




05

# వారసత్వం పేరిట వసూళ్ల వేట!

### మత్స్య సొసైటీ మోసం బహిర్గతం!

- సభ్యత్వం కాదండోయ్... లక్షల స్కాం!
- పందిళ్ళపల్లిలో పెద్దచెరువు దోపిడీ
- కమిటీ తక్షణమే రద్దు చేయాలి!
- మత్స్య శాఖ చేతిలో మత్తు లీకు
- మీడియా సమావేశంలో బాధితులు గగ్గోలు




ఖమ్మం, మహా

పందిళ్ళపల్లి (పెద్దచెరువు) మత్స్య సహకార సొసైటీలో పదకొండేళ్లుగా సాగుతున్న అక్రమాల పుట్టను బాధితులు విలేకరుల ముందుంచారు. వారసత్వం పేరిట వేల రూపాయల వసూళ్లు, సభ్యత్వాల కలయాపన, మత్స్య శాఖ అధికారుల అండతో నడుస్తున్న దోపిడీపై ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. సొసైటీ అధ్యక్షుడు లింగబోయిన వెంకటేశ్వర్లు (బుజ్జి), కార్యదర్శి షేక్ సైజానీల ఆధ్వర్యంలో కమిటీ పెద్ద ఎత్తున లూటీకి పాల్పడుతోందని ముక్తకంఠంతో ఆరోపించారు.



04

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది అని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాలోత్ రాందాస్ నాయక్ నేతృత్వంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు.

02
FOLLOW: @ANNTELUGU
17-5-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## విద్యుత్ శాఖలో భద్రతా వారోత్సవాలు

### జీరో ప్రమాదాల దిశగా చైతన్యం

**ఖమ్మం - మహా:** విద్యుత్ శాఖలో భద్రతా వారోత్సవాల సందర్భంగా సమగ్ర కార్యక్రమాలు నిర్వహించామని, వీటిద్వారా విద్యుత్ ఉద్యోగులతోపాటు ప్రజలు, ముఖ్యంగా రైతులకు ప్రమాద నివారణ అంశాలపై అవగాహన కల్పించామని విద్యుత్ శాఖ ఎస్ ఈ శ్రీనివాస చారి తెలిపారు. ఆయన వివరించగా, శాఖ సిబ్బందికి హెల్మెట్ల వినియోగం, లైన్ క్లియర్, ఎర్తింగ్ వంటి భద్రతా నిబంధనలు బోధించడంతోపాటు, బాధ్యతాయుతంగా పనులు నిర్వహించేలా చైతన్య వృద్ధి జరగిందన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ బోధనలో ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగి మహేందర్‌కు ఘనంగా నివాళులు అర్పించారని తెలిపారు. సిఎండి గౌరవ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన సంతాప సమావేశంలో అధికారులంతా పాల్గొని అతని సేవలకు శ్రద్ధాంజలి ఘటించారని పేర్కొన్నారు. "జీరో ప్రమాదాలు సాధించాలన్నది మా లక్ష్యం. ప్రతి ఉద్యోగి, ప్రతి అధికారి ఈ దిశగా నిబద్ధతతో పని చేయాలి," అని శ్రీనివాస చారి స్పష్టం చేశారు. కేవలం విద్యుత్ రంగం మాత్రమే కాక, వాహనదారులు, గ్యాస్ వినియోగదారులు, పరిశ్రమల కార్మికులు కూడా ప్రమాద నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, సివిల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, రెవిన్యూ అకౌంట్స్ ఆఫీసర్ కే. శ్రీధర్, ఇతర ఇంజనీర్లు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బందికి భద్రతా ప్రాధాన్యతపై స్పష్టతనిచ్చే శిక్షణలు, ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా విద్యుత్ శాఖ ఒక మంచి మార్గదర్శకంగా నిలుస్తోంది.



# పశువుల అక్రమ రవాణాకు చెక్

- జిల్లా ,రాష్ట్రాల సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు
- నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**ఖమ్మం - మహా:** పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని జిల్లా, రాష్ట్రాల సరిహద్దులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. శుక్రవారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. 24x7 నిరంతర పర్యవేక్షణలో వుండేవిధంగా జిల్లా, రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక చెక్ పోస్టులలో పోలీసు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో షిఫ్ట్ ల వారిగా సమన్వయంతో పనిచేస్తాయని, పశువులను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందస్తు చర్యలలో భాగంగా పశువుల రవాణా విషయంలో వివాదాలు తలెత్తకుండా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువుల అక్రమ రవాణా, గోవధ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పదని అన్నారు. ప్రధానంగా బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల రవాణా విషయంలో అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, చట్టవిరుద్ధంగా ఆవులు,దూడలను రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. పశువులను రవాణాచేసే ప్రతి వాహనానికి తగు నిర్ధారిత ప్రమాణిక పత్రాలు (వాలిడ్ డాక్యుమెంట్స్) ఉండాలని స్పష్టం చేశారు. సరిహద్దు రాష్ట్రాల



నుండి రవాణా అయ్యే పశువుల విషయంలోనూ నియమ, నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. సరైన పత్రాలు వారి వెంట ఉన్నాయనే విషయాన్ని పరిశీలించి అనుమతించాలని, అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకోవాలని చెప్పారు. పండుగల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ద్వారా మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు, రెచ్చగొట్టే, అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మతపెద్దలతో శాంతి సమీక్షా సమావేశాలు నిర్వహించి, భద్రతా పరంగా ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, మత సామరస్యంతో జరుపుకునేలా అవసరమైన చోట్ల ముందస్తుగా పటిష్టమైన పోలీసు బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా అక్రమ రవాణా నియంత్రించేందుకు నిఘా విభాగం అప్రమత్తంగా వుంటుందని, చెక్ పోస్టుల తనిఖీలే కాకుండా జిల్లా కేంద్రంలో సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని అన్నారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు సీజ్ చేస్తారని అన్నారు.

### సరిహద్దు చెక్ పోస్టులు

పాలడుగు (వైరా) భస్వాపూరం క్రాస్ రోడ్డు (కొణిజర్ల )హనుమాన్ తండా (కల్లూరు )వెంకటగిరి క్రాస్ రోడ్డు (ఖమ్మం రూరల్) సుబ్లేడ్ క్రాస్ రోడ్డు (తిరుమలాయపాలెం) పాలేరు సింగరేణిపల్లి ప్లాజా (కూసుమంచి )వల్లభి (ముదిగొండ )

## వనమహోత్సవం.. వ్యూహాత్మక కార్యాచరణ

**ఖమ్మం - మహా:** ప్రకృతిని పరిరక్షించడమే ముఖ్య ఉద్దేశ్యంగా రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవం 2025-26ను సమగ్రంగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా నాలుగు లక్షల మొక్కలను నాటే మహత్తరమైన లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించబడింది. ఈ కార్యాచరణకు ముందస్తు చర్యగా హార్టికల్చర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో గార్డెన్ విభాగానికి చెందిన సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హార్టికల్చర్ అధికారి మాట్లాడుతూ, మొక్కలు నాటేందుకు అనువైన ఖాళీ స్థలాలను గుర్తించడం అత్యంత కీలకం అని తెలిపారు. గతంలో మొక్కలు నాటి, అవి పెరిగే సమయంలో విఫలమైన ప్రదేశాలను మళ్లీ పరిశీలించి, ఆ ప్రదేశాల్లో కొత్త మొక్కలు నాటే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా, బల్క్



ప్లాంటేషన్ చేపట్టగలిగే విస్తీర్ణాల గుర్తింపు పట్ల స్పష్టమైన దృష్టితో ముందుకు సాగాలని సూచించారు. మొక్కల సంరక్షణ విషయమై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు గుర్తించారు. ఒక్కొక్క మొక్కను మన భవిష్యత్ జీవనానికి పునాది అని భావిస్తూ, వాటి నీటిపోశణ, కంచె ఏర్పాటు, రక్షణ చర్యలు మొదలైనవి ముందుగానే ప్రణాళికలో భాగం కావాలని సూచించారు. ప్రతి డివిజన్ స్థాయిలో నాటింపు కార్యాచరణను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన వనరులు, మానవబలం, మౌలిక సదుపాయాల సమన్వయంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ సమతుల్యత మెరుగవడమే కాక, నగరాల్లో హరితవనాల విస్తరణకు కూడా ఎంతో దోహదపడనుంది. నగరాల చుట్టూ పచ్చదనం పెరగడంతో పెరిగే ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో పాటు, వాయు నాణ్యత మెరుగవుతుంది. ఇది ప్రజల ఆరోగ్యానికి దోహదపడే సూచికగా మారు తుంది. మొక్కలు మన సమాజానికి అందించే మౌలిక ప్రయోజనాలను మనం గుర్తించి, వాటిని సమర్థంగా నిలబెట్టుకోవడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలవనుంది. ఈ కార్యక్రమాన్ని సఫలీకృతం చేయడంలో అధికార యంత్రాంగం కాక, సామాజిక సంస్థలు, విద్యార్థులు, ప్రజలు అందరూ భాగస్వాములై నిలవాలని అధికారులు పిలుపునిచ్చారు.

## అధిక యూరియా వాడకం తగ్గించాలి

### కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త నవీన్ కుమార్

**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామపంచాయతీ లో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతలకు పంటలపై అవగాహన కార్యక్రమం, మండల వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్, శ్రీనివాసరావు, ఇల్లెందు ఏడిఏ లాల్చంద్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ... రైతులు దుక్కుల సమయంలో లోతుగా దున్నడం వల్ల కీటకాలు నశిస్తాయని. పంటలు వేశాక అధిక యూరియా వాడకం వల్ల చీడపీడలు పెరిగి రైతులకు ఎక్కువ ఖర్చు వస్తుందని ఏరియా వాడకం తగ్గించాలని సూచించారు.





# నవ దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కందాళ

**కూసుమంచి, మే 16, మహా:** కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేడేపల్లి వెంకన్న - వీరమ్మ ల కుమారుడు పరశురాం - లావణ్యాల వివాహం సందర్భంగా శుక్రవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గట్టుసింగారం గ్రామంలోని వెంకన్న నివాసంలో నూతన వధూవరులను ఆశీర్వదించి అక్షింతలు వేశారు.అనంతరం పెరికసింగారం గ్రామానికి చెందిన దొంగరి శ్రీను - శైలజల కుమారుడు విజయ్ కాంత్ వర్మ - రామలను ఖమ్మం రూరల్ మండలలోని టిసివి రెడ్డి ఫంక్షన్ హాల్లో హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వేముల వీరయ్య,మహమ్మద్ ఆసిఫ్ పాషా,మాజీ ప్రజా ప్రతినిధుల స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరండి

## జీళ్ళచెరువులో హైస్కూల్ ఆధ్వర్యంలో బడిబాట



**కూసుమంచి, మే 16, మహా:** ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యను అభ్యసించిన ఉపాధ్యాయులతో విద్యాబోధన కల్గి ఉందని, మంచి ఫలితాలు వస్తున్నాయని జీళ్ళచెరువు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాస్ రావు తెలిపారు. శుక్రవారం జీళ్ళచెరువు గ్రామంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తుమ్మా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు , పూర్వ విద్యార్థులతో కలిసి మందుల బజార్, వడ్రంగి బజార్ లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళు న్న విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను పంపించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతులతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, దుస్తులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక రకాలుగా ప్రయోజనాలు ఉన్నాయని, ఉచితంగా చదువులను అందిస్తున్నామని, నాణ్యమైన విద్యాబోధన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు ఐతగాని నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖరరావు, పద్మజ, నీరజ, నందమూరి నరసింహరావు, అరుణ, సన్నీ, గ్రామస్థులు వెంకన్న, రమేష్, నగేష్, అప్పారావు, లింగయ్య, వీరబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వరి కొయ్యలను తగలబెట్టవద్దు



**కూసుమంచి, మే 16, మహా:** రైతులు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య రైతులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కూసుమంచి మండలంలోని జుజ్జుల్ రావుపేట గ్రామంలో వరి కొయ్యలను తగలబెట్టిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. పంట అవశేషాలు తగలబెట్టడం ద్వారా ఒక టన్ను వరిగడ్డి కాల్చడం వల్ల 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాషియం, 1.2 కిలోల సేంద్రియ కార్బన్ కోల్పోవడం జరుగుతుందని, అదేవిధంగా 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1460 కిలోల కార్బన్ డయాక్సైడ్, 199 కిలోల బూడిద,2 కిలోల సల్ఫర్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలై వాయు కాలుష్యం అవుతుందని తద్వారా మానవుల ఊపిరితిత్తులకు సమస్యలు కలిగించే క్యాన్సర్ కారకాలు విడుదలవడం ద్వారా కలిగే నష్టాలు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సరిత,మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి, నవీన్, సౌమ్య మరియు రైతులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై పిచ్చి మొక్కలు తొలగించిన యువత



**దమ్మపేట ,మే 16 మహా:** లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా సేవ చేయడమంటే కరువైన ఈ తరం యువకుల్లో తాజాగా శుక్రవారం ఓ సంఘటన తారసపడింది. మందలపల్లి నుండి అశ్వారావుపేట వైపు వెళ్ళే రహదారి కి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు ,ముళ్ళపొదలను మందలపల్లి కి చెందిన కొందరు యువకులు జెసిబి సహకారం తో తొలగించారు. ఆర్ అండ్ బి శాఖాధికారులు చేయాల్సిన పనిని సమాజం పై ఉన్న భాద్యత తో పౌరులు ముందుకు వచ్చి చేయడంపై పలువురు అధికారులు అభినందనలు తెలిపారు. రోడ్డు కు రెండు వైపులా దారి మూసుకుపోయే విధంగా పిచ్చి మొక్కలు పెరగడంతో ద్విచక్ర వాహనదారులు పలుమార్లు ప్రమాదాల భారిన పడ్డారు. మరికొందరైతే ఏకంగా మృత్యువాత కు గురయ్యారు. ఈ విషయంపై సంబందిత శాఖాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికి ఫలితం లేక పోవడంతో చివరకు యువత నడుం బిగించారు. తాము రోజంతా కష్టపడి సంపాదించుకున్న దానిలో తమ వంతుగా కొంత ధనాన్ని కేటాయించి మొక్కలు తొలగిచారు. కార్యక్రమంలో షేక్ అజీమ్ , పాలడుగుల అబ్బులు , జెసిబి సోము , కొండ్రముచ్చు నాగరాజు ,అడపా చంటి , షేక్ జాన్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

# ఏడిస్ దోమ కాటు పెను ప్రమాదం

**టేకులపల్లి - మహా:** జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ముత్యాలంపాడు క్రాస్ రోడ్డులో డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ... నిల్వ ఉన్న మంచినీటిలో వృద్ధిచెంది పెరిగే ఈ ఏడిస్ దోమ డెంగ్యూ వైరస్ ఉన్న వ్యక్తులను కుట్టి ఆరోగ్యవంతులను కుట్టడం ద్వారా ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి త్వరగా వ్యాపిస్తుందని ఈ వ్యాధి లక్షణాలు అయిన తీవ్రమైన తలనొప్పి, అధిక జ్వరం, కండరాలు కీళ్ల నొప్పులు, కంటి వెనకాల నొప్పి, వాంతులు వికారం, నీరసం చర్మంపై దద్దుర్లు లాంటి లక్షణాలు కనిపిస్తాయని పై లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగ్యూ నిర్ధారణ కొరకు చేసే ఎలిసా పరీక్ష చేయించుకోవాలని వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే ఆలస్యం చేయకుండా చికిత్స తీసుకోవాలని వ్యాధి తీవ్రత అధికం అయితే శరీరంలో ప్లేట్ లెట్ల సంఖ్య పడిపోయి అంతర్గత రక్తస్రావం జరిగి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడవచ్చు అని తెలిపారు అన్నిటికంటే ముఖ్యంగా వ్యాధి వచ్చిన తర్వాత బాధపడే కంటే వ్యాధి రాకుండా ఉండడానికి అన్ని రకాల నివారణ చర్యలు ప్రజలు స్వచ్ఛందంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కంచర్ల వెంకటేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్ నాగు బండి వెంకటేశ్వర్లు కౌసల్య సింగ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ధరణి అమూల్య హారిక ఇంద్రజ నాగలక్ష్మి ఫార్మసీ ఆఫీసర్ శశికళ కిరణ్ కుమారి ల్యాబ్ టెక్నీషియన్ రాజు, గంటా శ్రీనివాస్ అరుణకుమారి ధనసరి రాంబాబు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు




# డిజిటల్ దిశగా ఖమ్మం మహిళా

- డీఐసీఎస్సీ పైలట్‌గా ఖమ్మం .. గ్రామీణ ఉపాధికి భరోసా
- స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, సేవా కేంద్రాలు
- ఖమ్మం మహిళల చేతులపై డిజిటల్ సేవల కేంద్రాలు

**ఖమ్మం - మహా:** దేశవ్యాప్తంగా ప్రారంభమైన డీఐసీఎస్సీ (డిజిటల్ సేవల ప్రాజెక్టు) కోసం ఖమ్మం జిల్లాను ముఖ్యంగా ఎంచుకోవడం గర్వకారణం. ఇది రాష్ట్రంలో ముందు నమూనాగా కొనసాగనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ మహిళలకు డిజిటల్ సేవల ద్వారా ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఖమ్మం జిల్లాలో 137 మంది స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలను ఎంపిక చేశారు. వీరిలో 70 మంది మహిళలు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్సెటి)లో వ్యాపార శిక్షణ పొందారు. వీరి కోసం త్వరలో జిల్లా వ్యాప్తంగా మోడల్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాలు రాజీవ్ యువ వికాసం మరియు డీఐసీఎస్సీ ప్రాజెక్టు ద్వారా మంజూరవుతాయి.

## సైబర్ నేరాలు పట్ల అప్రమత్తతో ఉండాలి

**కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్**



**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (మహా):** జిల్లా విద్యా శిక్షణా కేంద్రం కొత్తగూడెంలో శు క్రవారం జరుగుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టం, బాలికల అక్రమ రవాణా మరియు సైబర్ నేరాల పట్ల ఉపాధ్యాయులందరికీ డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం నేరం చేయడమే కాకుండా, నేరాన్ని దాచిపెట్టడం కూడా నేరంగా పరిగణించబడుతుందని తెలియజేశారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన దగ్గర నుండి పాఠశాల నుండి వెళ్లే వరకు కూడా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని, తెలియని కాల్స్ కు సమాధానం ఇవ్వడం వల్ల మన అకౌంట్ హ్యాక్ అయి అందులో ఉన్న సొమ్ము మొత్తం చోరీకి గురవుతుందని , అందుకే అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే కాల్స్ కానీ వీడియో కాల్స్ కానీ సమాధానం ఇవ్వవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్ సతీష్ కుమార్, 1వ టౌన్ సిఐ కరుణాకర్ , ఎస్ ఐ విజయ, రిసోర్స్ పర్సన్లు సైదులు, మీరా హుస్సేన్, మురళి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ సిబ్బందికి యోగా తరగతులు




**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (మహా):** కొత్తగూడెం హేమచంద్రాపురంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్లో ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి శుక్రవారం యోగా తరగతులను ఏర్పాటు చేసారు. ఈ తరగతులలో కొత్తగూడెం సబ్ డివిజన్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు మరియు సిబ్బంది, ఆర్మడ్ రిజర్వు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. నిత్యం విధులలో నిమగ్నమై ప్రజలకు సేవలు అందిస్తున్న పోలీస్ శాఖలోని అధికారులు మరియు సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు,మానసికంగా కూడా దృఢంగా ఉండే విధంగా చేయడంలో భాగంగానే శుక్రవారం యోగా తరగతులను ఏర్పాటు చేసారు. యోగా,ధ్యానం వంటివి అలవాటుగా చేసుకుని నిత్యం సాధన చేస్తే మానసిక ప్రశాంతతతో పాటు దైనందిన కార్యక్రమాలలో ఉత్సాహంగా,చురుకుగా పాల్గొనవచ్చని కొత్తగూడెం డిఎస్పీ అన్నారు. పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమ ఆరోగ్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ తరగతుల ఆవశ్యకత తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఆర్ఐలు లాల్ బాబు,మరియు సిబ్బంది హాజరయ్యారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

**మహా భద్రాచలం:** భద్రాచలం పట్టణంలో శుక్రవారం విషాద సంఘటన చోటు చేసుకుంది. వంశి అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. వాజేడు మండలానికి చెందిన వంశి, ప్రస్తుతం సామ్రాట్ రెసిడెన్సీ పక్కన అద్దె గదిలో నివాసం ఉంటున్నాడు. భద్రాచలంలోని దేవరాజ్ హాస్పిటల్‌లో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం విద్యుత్ తీగలు చేతికి తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ఎంఆర్పిఎస్ నాయకులు ముద్ద పిచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు అరికెల తిరుపతిరావు సహా పలువురు ధర్నాకు దిగారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని ఆరోపిస్తూ నిరసన తెలిపారు. సంఘటన స్థలానికి సీఐ నాగరాజు చేరుకొని కేసు నమోదు చేసి పోస్ట్ మార్టం కొరకు మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్**



**వైరా, మే 16, మహా:** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది అని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాలోత్ రాందాస్ నాయక్ నేతృత్వంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమంపై ఏమాత్రం రాజీ పడకుండా ముందుకు సాగుతోంది. పేదల గుండె చప్పుడు వినే ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో నేటి తెలంగాణలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా అందుతోంది" అని పేర్కొన్నారు. అలాగే, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ సందర్భంగా మాట్లాడుతూ, "ఈనాడు అనేక మంది ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందాల్సిన పరిస్థితుల్లో ఉన్నారు. వారి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కనికరంతో స్పందిస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం. ఇది ప్రభుత్వానికి ఒక మంచి ఆలోచన, మంచి పనిగా నిలుస్తోంది. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న తత్వానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య అవసరాలను తీర్చేందుకు కట్టుబడి ఉంది" అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏదునూరి సీతారాములు, కట్ల రంగారావు, సూతకాని జైపాల్, పమ్మి అశోక్, బోళ్ళ గంగారావు, మచ్చ బుజ్జి, శీలం చంద్రశేఖర్ రెడ్డి, చింతనిప్పు మాధవరావు, ధర్నా రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, శీలం నాగిరెడ్డి, షేక్ సైదా, తుమ్మల సత్యం, శ్రీరామునేని తిరుపతిరావు, నర్వనేని అశోక్, కట్ల సంతోష్, కోలికొండ వీరభద్రం, జవ్వాజి నాగరాజు, మోరంపూడి మధు, నాగనబోయిన కృష్ణ, పఠాన్ జాన్, తడికమళ్ళ నాగేశ్వరరావు, కొరివి కాటమరాజు, తెల్లూరి వీరయ్య, తాసిల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**టేకులపల్లి - మహా:** బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఇల్లందు డీఎస్పీ ఎన్. చంద్రబాను అన్నారు. శు క్రవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తాటిపాముల సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం, హిందూ మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ చంద్రబాను కలిసి మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా గోవధ చేయవద్దని, ప్రభుత్వం గోవధను నిషేధించిందని తెలిపారు. మతాలను గౌరవించుకుంటూ పండుగలను నిర్వహించుకోవాలని, శాంతియుతంగా ఆనందోత్సాహాలతో జరుపుకొని మత సామరస్యానికి పాటు పడాలని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో మత ఘర్షణలను ప్రేరేపించే వార్త ఏమైనా వస్తే నమ్మవద్దని కోరారు. ఎవరైనా జంతువుల అక్రమ వధకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పశువుల అక్రమ రవాణా చేస్తే ఊర్లో ఉన్నటువంటి ప్రతి ఒక్కరు పోలీసులకు 100 నెంబర్కు డయల్ చేసి సమాచారం ఇవ్వగలరు అని వారు తెలిపారు. చిన్న



సంఘటన జరిగినా పోలీసులకు, డయ ల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ముస్లిం మత పెద్దల సలహాలు,సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి ఎస్సై ఆలకుంట రాజేందర్ , బోడు ఎస్సై పి. శ్రీకాంత్ ,ముస్లిం పెద్దలు అఫ్రోజ్ పాషా, ఖాజా, షకీల్, అహ్మద్ పాషా, షఫీ,రఫీ, నయీం, అనీఫ్, జానీ, బిజెపి నాయకులు మండల అధ్యక్షుడు శంభు నాయక్, బోడ పుణ్య నాయక్, బాలాజీ, సురేష్, నాగేందర్, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
17-5-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు




# వారసత్వం పేరిట వసూళ్ల వేట!

**ఖమ్మం - మహా:** పందిళ్ళపల్లి (పెద్దచెరువు) మత్స్య సహకార సొసైటీలో పదకొండేళ్లుగా సాగుతున్న అక్రమాల పుట్టను బాధితులు విలేకరుల ముందుంచారు. వారసత్వం పేరిట వేల రూపాయల వసూళ్లు, సభ్యత్వాల కలయాపన, మత్స్య శాఖ అధికారుల అండతో నడుస్తున్న దోపిడీపై ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. సొసైటీ అధ్యక్షుడు లింగబోయిన వెంకటేశ్వర్లు (బుజ్జి), కార్యదర్శి షేక్ సైజానీల ఆధ్వర్యంలో కమిటీ పెద్ద ఎత్తున లూటీకి పాల్పడుతోందని ముక్తకంఠంతో ఆరోపించారు.

### వారసత్వం పేరుతో సొమ్ము సభ్యత్వం మాత్రం ఇతరులకు!

సొసైటీలో ఉన్న 149 సభ్యుల్లో సుమారు 48 మంది మరణించగా, వారసత్వ హక్కుగా వారి కుటుంబ సభ్యులు సభ్యత్వం కోసం దరఖాస్తు చేసినా... ఒక్కరికి కూడా సభ్యత్వం ఇవ్వకుండా ఒక్కొక్కరినుండి రూ.6వేల నుంచి ఎక్కువగా వసూలు చేశారని సింగారపు వీరమల్లు, వీరభద్రం, లింగం సైదులు పేర్కొన్నారు. సభ్యత్వం ఇచ్చే పేరుతో డబ్బులు వసూలు చేసి, బదులుగా ఇతరులకు ఇవ్వడం దారుణమన్నారు. ఇదంతా మత్స్య శాఖ ఏడి మద్దతుతో జరుగుతోందన్నది బాధితుల వాదన.

### అధికార బేఖాతరు ప్రజల ఆక్రందనలు

ఈ స్కాంపై మత్స్య శాఖ ఏడి కూ మూడు సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండా కాలయాపన చేస్తున్నారని వారు ఆరోపించారు. గ్రీవెన్స్ సమావేశంలో కలెక్టరుకూ ఫిర్యాదు చేసినా, ఆయన ఇచ్చిన ఆదేశాలనూ ఏడి సైతం పట్టించుకోవడం లేదంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారులు స్వయంగా అన్యాయం చేస్తున్న పరిస్థితి దురదృష్టకరమన్నారు.

### సొసైటీ కబ్జా - సొమ్ము దోచుడు

కొత్తగా సుమారు 50 మందికి సభ్యత్వం పేరిట ఒక్కొక్కరినుండి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేయడం, మొత్తంగా రూ.50,000ల దాకా దోచుకోవడం అన్యాయమని బాధితులు ఆరోపిస్తున్నారు. పాత అక్రమాలకు పాల్పడిన ఏడి ఇప్పటికే సస్పెండ్ అయినా... మిగిలినవారు మాత్రం అదే దారిలో నడుస్తున్నారంటే ప్రభుత్వ నిఘా వ్యవస్థల వైఫల్యం స్పష్టమవుతోంది.

### ప్రభుత్వం స్పందించకపోతే రోడ్డున పోరాటమే!

తమకు న్యాయం జరగకపోతే, బాధితులందరూ పందిళ్ళపల్లి నుంచి జిల్లా కలెక్టరేట్ దాకా ర్యాలీగా వచ్చి నిరసన తెలపకతప్పదని హెచ్చరించారు. దీనిపై వెంటనే విచారణ జరిపి సొసైటీ అక్రమాలను అరికట్టాలని, లేకపోతే పెద్ద ఉద్యమమే జరుగుతుందని స్పష్టం చేశారు.

### బాధితుల గళానికి న్యాయం ఎప్పటికి?

పదే పదే అధికారులను ఆశ్రయించినా, కమిటీపై చర్యలు లేకపోవడంపై బాధితులు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. కలెక్టర్ సైతం ఇచ్చిన ఆదేశాలు పట్టించుకోకుండా, నిబంధనలే లేనట్టుగా వ్యవహరిస్తున్న మత్స్య శాఖ ఏడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిటీ రద్దు చేసి, సభ్యులకు సభ్యత్వాలు తిరిగి ఇచ్చి, వసూలైన మొత్తాలు తిరిగిపెట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీ గోకుల రామంలో గోవులకు మరో రెండు షెడ్లు



**మహా భద్రాచలం:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కు చెందిన ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం లో ఉన్న శ్రీ గోకుల రామంలో మరో రెండు షెడ్లను గోవుల కోసం నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని ప్రవాస భారతీయులు సూది రెడ్డి రామకృష్ణారెడ్డి,శాంత, సత్యనారాయణ రెడ్డి,విజయ లు అందజేశారు. ఒక్కొక్క షెడ్డును రు.20 లక్షలతో నిర్మించనుండగా దీనికి సంబంధించిన పనులకు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి భూమి పూజ పనులు నిర్వహించారు. ఈ సమయంలో విశ్వక్సేన పూజ పుణ్యాహవాచనం ఇతర ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటికే గోవులకు రెండు షెడ్లు ఉండగా మరో రెండు షెడ్ల నిర్మాణం దేవస్థానం అధికారులు చేపడుతున్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ఖమ్మం - మహా:** రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో నగర కాంగ్రెస్ నేతలతో జై భీం జై బాపు జై సంవిధాన్ పై 2వ పట్టణ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జై బాపు జై భీమ్ జై సంవీధాన్ ప్రోగ్రామ్ ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయా డివిజన్ అధ్యక్ష,కార్యదర్శులకు సూచించారు.కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంపై చేస్తున్న దాడిని ప్రజలకు వివరించాలన్నారు.బీజేపీ అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాజ్యాంగ బద్ధ సంస్థలను ఎలా నిర్వీర్యం చేస్తుందో ప్రజలకు వివరించాలన్నారు. కరపత్రాల రూపంలో గోడపత్రిక రూపంలో జై భీం జై బాపు జై సంవిధాన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దిద్దుకురి వెంకటేశ్వర్లు పైడిపల్లి రోహిణి సత్యనారాయణ రాపర్తి శరత్ 13 డివిజన్లో అధ్యక్షులు పోటీ చేసినటువంటి అభ్యర్థులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోటకూరి శివయ్య సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ బండి మాధవరం ఏలూరు రవికుమార్ జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కుంటిముక్కల నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి పర్సనల్ డిపార్ట్మెంట్ జనరల్ మేనేజర్లతో సిఎండి బలరాం సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (మహా):** సింగరేణి సంస్థ పర్సనల్ డిపార్ట్మెంట్ జనరల్ మేనేజర్లతో ఈరోజు శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ ఎన్. బలరాం, సమీక్షను నిర్వహించారు. ఈ సంధర్భంగా సిఎండి ఎన్. బలరాం, ఇంటర్నల్ మరియు ఎక్స్టర్నల్ నియామకాలు, విధులకు గైర్హాజరు అవుతున్న ఉద్యోగులపై తీసుకునే క్రమశిక్షణాచర్యలు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, కారుణ్య నియమకాలు, పదవీ విరమణ పొందే ఉద్యోగుల సిఎంపిఎఫ్, పెన్షన్, గ్రాట్యుటీ చెల్లింపులు, సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డులు, క్వార్టర్స్, ఉద్యోగుల పదోన్నతులు, పారిశ్రామిక సంబంధాలు వంటి అంశాలపై సమీక్షించారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఎటువంటి ఫైల్స్ పెండింగ్ లో ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలని, కార్మిక సంక్షేమం విషయం లో ఎటువంటి నిర్లక్షం వహించకూడదు కూడదు అని అన్నారు. ముఖ్యంగా విధులకు గైర్హాజరు అయ్యే ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులతో కలసి కౌన్సెల్లింగ్ నిర్వహించాలని తద్వారా ఉద్యోగి క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్మెంట్ మరియు సిఎస్ఆర్ విభాగాల పనితీరుపై కూడా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్(పా) పి అండ్ పి కే.వెంకటేశ్వర్లు జిఎం(సిపిపి) ఏ.మనోహర్, జిఎం(పర్సనల్) ఐఆర్, పిఎం కవితా నాయుడు, జిఎం(పర్సనల్) ఆర్సి బెర్నడెట్ నికోలస్, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, ఈఈ సెల్ ఇంచార్జ్ ఏజేఎం మురళీధర్ రావు, హెచ్ఓడి(ఐఈ) బొజ్జ రవి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సీఎం రేవంత్‌రెడ్డి



**కారేపల్లి, మహా:** విదేశీ మహిళల మెప్పుకోసం సీఎం రేవంత్‌రెడ్డి స్వరాష్ట్ర మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని ఐద్వా కారేపల్లి మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి విమర్శించారు. శుక్రవారం కారేపల్లిలో జరిగిన ఐద్వా మండలకమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అందగత్తెల పోటీదారులు గుడిలోకి వెళ్ళటానికి రాష్ట్ర మహిళలచేత కాళ్లు కడిగించటం, కాళ్లు తుడిపించటం అవివేకమన్నారు. ఎక్కడ లేని కాళ్లు కడిగించే సంప్రదాయాన్ని తమ మెప్పుకోసం చేయించారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళాకు వచ్చిందన్న ముఖ్యమంత్రి ప్రపంచసుందరి పోటీలు అట్టహాసంగా చేయటానికి ఎక్కడినుంచి నిధులు వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల అందాన్ని అంగడి సరుకుగా మార్చిన పెట్టుబడిదారి వర్గానికి సీఎం వత్తాసు పలుకుతూ భారతీయ సాంస్కృతిని మహిళలను కించపరస్తున్నారన్నారు. రాష్ట్ర మహిళలకు సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో ఐద్వా నాయకురాళ్లు సూరబాక ధనమ్మ, కరపటి రాంబాయి, వరలక్ష్మి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద విధానాలు అభివృద్ధికి ఆటంకం




**కారేపల్లి, మహా:** మతోన్మాద విధానాలు దేశాభివృద్ధికి తీవ్ర అటంకం కల్గిస్తాయని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వై.ప్రకాష్ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండలం మాధారంలో రైతుకూలీ సంఘం సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటే స్వామినాధన్ కమీషన్ సిఫార్స్‌లు అమలుచేయాటమే మార్గమన్నారు. రైతు గిట్టుబాటు ధరకల్పించకుండా రైతును దివాళా తీయించే విధంగా మార్కెట్ల ప్రయివేటీకరణ,విద్యుత్ ప్రయివేటీకరణ, ఎరువుల సబ్సీడీలు తగ్గింపువంటి చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 29 కార్మిక చట్టాలని రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకవచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు. దీంతో కార్మికుల 8 గంటల పని విధానం రద్దు చేయబడి 12 గంటల పని చేయాల్సి వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కోయిల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, కుర్ర శ్రీను, గద్దం వెంకన్న, బీ.వీరు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ జోక్యంతో అర్హులను అన్యాయం



**కారేపల్లి, మహా:** ప్రభుత్వ పథకాల అమలులో రాజకీ య జోక్యం పెరిగి అర్హులకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయ కులు ఎస్‌కె.గౌసుద్దీన్ విమర్శించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాల అమలును అందరికి అమలు చేసి చూపిందన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రుణమాఫీ, రైతు బంధు ఎగవేశారన్నారు. రేషన్ కార్డులు, ఇండ్లు ఇస్తామని వాటిని ఎంపికల పేరుతోకాలయాపన చేస్తున్నారన్నారు. పథకాలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, పైరవీ కారులకు తప్ప నిజమైన అర్హులకు అందటం లేదని క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే తెలుస్తుందన్నారు. పారదర్శకంగా ప్రజాపాలన గ్రామసభలలో అర్హుల ఎంపిక చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలకు పెత్తనం ఇచ్చి ఎంపికను రాజకీయం చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు గ్రామసభలో పెట్టి నిజమైన లబ్ధిదారులకు లాటరీ ద్వారా ఎంపిక చేసి పేదల అండగా నిలిచిందని గుర్తుచేశారు.

# 20న నిరసన ర్యాలీలు

## కేంద్ర ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా అఖిలపక్ష పిలుపు



**ఖమ్మం - మహా:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న ఖమ్మం జిల్లావ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు అఖిలపక్ష కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. శుక్రవారం ఖమ్మం ఐఎన్టియుసి కార్యాలయంలో అఖిలపక్ష నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు, 3 వ్యవసాయ నల్ల చట్టాల రూపంలో కార్మికుల హక్కులను, రైతుల భద్రతను, శ్రామిక వర్గాల జీవన ప్రమాణాలను సీరియస్‌గా ప్రభావితం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు మాత్రమే అండగా నిలుస్తున్నదని మండిపడ్డారు. ప్రస్తుతం దేశంలో పనిదినాలు తగ్గిపోతున్నా, వేతనాలు స్థిరంగా లేకపోయినా, ధరలు ఆకాశాన్ని తాకుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్మిక చట్టాల రద్దు, మళ్లీ 44 పాత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి, సిఐటియు, ఏఐటియుసి, టీయూసీఐ, ఏఐకేఎస్, కాంగ్రెస్ కిసాన్ సెల్, బికేయం యూ, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మే 20న జాతీయస్థాయిలో జరిగే 28వ సార్వత్రిక సమ్మెలో 50 కోట్ల మంది కార్మికులు పాల్గొనబోతున్నారని, అదే విధంగా ఖమ్మం జిల్లాలోనూ పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# బెల్టుషాపులను నియంత్రించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 ( మహా):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణం పరిధిలోని ఏ యొక్క వైన్ షాప్ లో కూడా బ్రాండెడ్ మద్యం దొరకకుండా కేవలం పేదలు తాగే మద్యాన్నే టార్గెట్ గా పెట్టుకొని వాటిని మాత్రమే వైన్ షాప్ లలో అమ్మకానికి లేకుండా కేవలం బెల్ట్ షాప్ లలో మాత్రమే దశనమిచ్చేలా కొత్తగూడెం సిండికేట్ వ్యాపారస్థులు చీకటి దందాని కొనసాగిస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు ఆరోపించారు. అదే విధంగా వైన్ షాపుల్లో దొరకని మద్యాన్ని సిండికేట్ వాళ్ళు సుమారుగా ఒక్కొక్క క్వార్టర్ పై 70 రూపాయలు మరియు ఒక్క బీర్ పై సగటున 50 రూపాయలు పెంచి బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నారు..దీని ద్వారా సామాన్యులు, కూలి పని చేసుకునే వారు ఆర్థిక దోపిడికి గురవుతున్నారు. పేదవాని జేబులకు చిల్లులు పడకుండా, వైన్ షాపులపై తగు చర్యలు తీసుకొని అన్నిరకాల మద్యాన్ని వైన్ షాపులలో అందుబాటులో ఉండేవిధంగా మరియు ఎం ఆర్ పి రేట్లకు మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఎక్సైజ్ అధికారులకు బిఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.





# తిరంగ యాత్రను విజయవంతం చేయండి

**నేలకొండపల్లి, మే 16 మహా:** ఆపరేషన్ సిందూర్ విజయం నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగ యాత్ర ను విజయవంతం చేయాలని బీజేపీయం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శు క్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు..పాకిస్తాన్ ఉగ్రవాదులను ఊచకోత కోసిన భారత సైన్యం కు దేశమంతా ఏకమై అభినందనలు తెలిపే తిరంగ యాత్ర ను ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని సూచించారు. త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞత చాటేందుకు బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న తిరంగ యాత్ర ను నిర్వహించనున్నట్లు తెలిపారు. సైనికుల పోరాట పటిమ ను కీరిస్తూ దేశం పై ప్రేమ ను చాటుతూ ప్రతీ ఒక్కరూ తిరంగా యాత్ర లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వెంటనే కొనుగోలు శర వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, ఉపాధ్యక్షుడు కాళంగి వెంకటేశ్వర్లు, కె.గోపి తదితరులు పాల్గొన్నారు.





# మంత్రి పొంగులేటిని కలిసిన కొరిపల్లి శ్రీనివాస్

**ఖమ్మం, మహా:** తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని హైదరాబాద్ మినిస్టర్స్ కోటర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన, రాష్ట్రంలో మాదిగ జాతికి చెందిన పేద కుటుంబాల అభివృద్ధికి మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డా. కొరిపల్లి మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న మాదిగ హక్కుల దండోరా ఉద్యమం ఫలితంగా ఎస్సీ ఉపవర్గీకరణకు చట్టబద్ధత లభించిందని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపవర్గీకరణలో ఎస్సీలను ఏ, బి, సి వర్గాలుగా విభజించడం ద్వారా మాదిగ, ఇతర అనునాయిత వర్గాలకు న్యాయం జరిగిందని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం పాలించిన న్యాయబద్ధ విధానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని దళిత నిరుపేద కుటుంబాలకు 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రత్యేక దృష్టితో వర్తింపజేయాలని డా. కొరిపల్లి మంత్రి పొంగులేటిని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి, రాష్ట్రంలోని అన్ని అర్హులైన దళిత పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. దీనిపై మంత్రి పొంగులేటికి డా. కొరిపల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ ఉపకులాల జేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవరపు డేవిడ్ రాజు, చర్మకారుల సంఘం అధ్యక్షురాలు ఇటుకల లత, మాదిగ జేఏసీ అధ్యక్షుడు జిల్లా విజయకుమార్, సామాజిక ఉద్యమ నేత పుల్లూరు గౌతమ్, శ్రీనివాస్, నాగరాజు, మాదిగ సత్యనారాయణ, జంగం వెంకయ్య, జంగం నాగరాజు, రవిబాబు, నవీన్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

**నేలకొండపల్లి మే 16 మహా:** ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు సూచించారు. మండలం లోని కోనాయిగూడెం, ఆరెగూడెం, ఆచార్లగూడెం లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పాఠశాల ద్వారా అందించే సౌకర్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... ఆరెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత రెండుళ్లు గా నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్పోరేట్ స్థాయి లో ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయలు సమిష్టి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోనాయిగూడెం, ఆచార్లగూడెం కు చెందిన విద్యార్థులు ఆరెగూడెం పాఠశాల కు వచ్చేందుకు ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో ఆటో సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బస్వాశేషరావు, బీ.వెంకన్న, షేక్ నాగుల్మీరా తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ పరిరక్షణ కమిటి ఎన్నిక

**నేలకొండపల్లి మే 16 మహా:** రాజ్యంగ పరిరక్షణ కమిటి ని మండల కేంద్రంలోని మసీద్ లో శుక్రవారం ఎన్నుకున్నారు. కమిటి నూతన అధ్యక్షుడు గా అబ్దుల్ సత్తార్, ఉపాధ్యాక్షులు గా రహిం, కార్యదర్శి గా రసూల్, సహాయ కార్యదర్శి గా షేక్ సలాం, కోశాధికారిగా షేక్ ఖలీద్, గౌరవ సలహాదారులు గా ఖాదర్ బాబా, కార్యవర్గ సభ్యులు గా షేక్ రఫీ, సొందుమియా, నాగుల్ పాషా, హయిమ్, ఇమామ్, హుస్సేన్, అన్వర్ లు ఎన్నికైయ్యారు. ఈ సమావేశంలో రాజ్యంగ పరిరక్షణ కమిటి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాదిక్ ఆలీ, పాలేరు నియోజకవర్గం అధ్యక్షుడు నజీర్, మండల అధ్యక్షుడు సుభాన్, మసీద్ కమిటి అధ్యక్షుడు మైబువలీ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రంలో ఇంకెన్నాళ్లు ఉండాలి

**నేలకొండపల్లి మే 16 మహా:** ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇంకా ఎన్నాళ్లు పడిగాపులు కాయాలని రైతులు అగ్రహాం వ్యక్తం చేశారు. భారీ ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నేలకొండపల్లి మండలం లోని అనాసాగారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం లో నెల రోజుల క్రితం రైతులు దాదాపు 10 వేల బస్తాలు ధాన్యం తీసుకొచ్చారు. కానీ నేటి వరకు కాంటాలు వేయకపోవటంతో రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గ్రామం నుంచి రైతులు పెద్ద ఎత్తున ర్యాలీగా నేలకొండపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు వచ్చి ఆందోళన చేపట్టారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ను అందించారు. సమస్య ను వివరించారు. స్పందించిన తహశీల్దార్ జిల్లా అధికారులకు సమాచారం అందించారు. ఈ



మేరకు సదరు అధికారులు వెంటనే కాంటాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడారు....నెల రోజులు గా ధాన్యం కాంటాల కోసం పడిగాపులు కాస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని అగ్రహాం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వహాకులు జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా క్వింటాకు 7 కిలోల పైన మిల్లర్లు తరుగు తీస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా కేంద్రంలో కాంటాలు వేగవంతంగా చేపట్టటం తో పాటు, ఎగుమతులు, దిగుమతులు శర వేగంగా చేపట్టాలని, తరుగు ను నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.



# మహారహదారి మార్గంలో ఖమ్మం

- రింగ్ రోడ్డు రాకతో నగరానికి ఊపిరి
- గ్రీన్‌ఫీల్డ్ గమ్యంతో గ్రీన్ సిగ్నల్
- దేశవీధుల్లో కీలక కేంద్రమవుతున్న ఖమ్మం
- నాగపూర్-అమరావతి కారిడార్‌కు వారధి

ఖమ్మం – మహా: ఖమ్మం జిల్లా ప్రజల శ్రమకు ప్రతిఫలంగా అభివృద్ధి గమ్యాన్ని చేరుకుంటున్న భూమి. రైతు కష్టానికి సాక్షిగా పచ్చని పొలాలు కనిపించే ఈ నేల ఇప్పుడు రహదారి నిర్మాణాలతో నూతన యుగాన్ని ఆరంభిస్తోంది. నగరానికి నాలుగు దిక్కుల నుంచి ప్రయాణ మార్గాలు విస్తరిస్తుండటంతో, వాణిజ్యం, వ్యవసాయం, పరిశ్రమలకు జీవనదాయినిగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహంతో, రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయంతో ముందుకు సాగుతున్న రహదారి ప్రణాళికలు ఖమ్మాన్ని రాష్ట్రమంతటా మార్గ సూచిగా నిలిపేలా ఉన్నాయి. ఇప్పటికే ప్రారంభమైన గ్రీన్‌ఫీల్డ్ హైవే, పురోగతిలో ఉన్న ఖమ్మం విజయవాడ నాలుగు లైన్లు, శీఘ్రంలో ఆరంభమయ్యే నాగపూర్ అమరావతి కారిడార్ ఇవన్నీ కలసి జిల్లా భవిష్యత్‌ను వెలిగించే దీపస్తంభాలుగా మారాయి. నగరాన్ని చుట్టుముట్టే రింగ్రోడ్డు నిర్మాణం, ప్రజలకు సౌలభ్యంతో పాటు అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఈ అన్ని ప్రణాళికలు ఒకే దిశగా ం ఖమ్మాన్ని శాశ్వతంగా అభివృద్ధి పటములో నిలబెట్టాలనే సంకల్పానికి నిదర్శనాలు.

## అభివృద్ధికి మైలురాళ్లవుతున్న రహదారులు

ఖమ్మం జిల్లా ప్రస్తుతం అనేక రహదారి ప్రాజెక్టుల తాలూకు నిర్మాణాలతో అభివృద్ధి బాటలో దూసుకుపోతోంది. వాణిజ్య, వ్యవసాయ, పరిశ్రమల అభివృద్ధికి బలం చేకూర్చే విధంగా హైవేలు, రింగ్ రోడ్డు, ఎకనామిక్ కారిడార్‌లు నిర్మాణ దశల్లో ఉన్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్ హెచ్-365బి బి), 162 కిలోమీటర్ల పొడవుతో నిర్మాణంలో ఉంది. ఇది అమలవుతుండటంతో ఖమ్మం-విశాఖపట్నం మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. అలాగే ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే (ఎన్ హెచ్-163జి) 29.92 కిలోమీటర్ల దూరం కలిగి ఉండగా, దానికి రూ. 984 కోట్లకు పైగా వ్యయం కేటాయించబడింది. ఈ రహదారి పూర్తయితే, ఖమ్మం ఆంధ్రాకు సులభదారి అవుతుంది. నాగపూర్-అమరావతి ఎకనామిక్ కారిడార్లో ఖమ్మం కీలకంగా మారుతోంది. 405 కిలోమీటర్ల ఈ కారిడార్ దేశంలోని ప్రధాన వ్యాపార మార్గాల్లో ఒకటిగా అభివృద్ధి చెందుతుంది. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది.

## ఔటర్ రింగ్ రోడ్‌తో నగర విస్తరణ

ఖమ్మం నగరాన్ని చుట్టి ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం ప్రారంభం కావడం స్థానిక ట్రాఫిక్‌కు ఊపిరి పీల్చేలా మారుతోంది. సర్వేలు, ప్రాథమిక నిర్మాణాలు ఇప్పటికే పూర్వ కర్తవ్యంగా జరుగుతున్నాయి. దీనివల్ల నగర అభివృద్ధికి తలుపులు తెరుచుకుంటున్నాయి. ఖమ్మం-కురవి ప్రాజెక్ట్ కూడా జిల్లా అభివృద్ధికి మరో మైలురాయి. ఈ 37.45 కిలోమీటర్ల మార్గానికి రూ. 445 కోట్ల వ్యయం కేటాయించబడగా, 2026 మార్చి నాటికి పూర్తయ్యేలా లక్ష్యం పెట్టుకున్నారు.






## భూసేకరణలో మానవతా దృష్టికోణం

ఈ రహదారి ప్రాజెక్టులన్నింటికీ భూముల అవసరం అత్యవసరం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను రైతులతో సంప్రదించి, సముచిత పరిహారం చెల్లించేందుకు మానవతా దృష్టితో వ్యవహరించమని ఆదేశించిన విషయమూ ప్రస్తావనీయమైనది. ఈ సమస్త రహదారి ప్రాజెక్టులు పూర్తయితే ఖమ్మం జిల్లా తెలంగాణలో కాకుండా దక్షిణ భారతదేశంలో కీలక రవాణా హబ్‌గా ఎదగనుంది. వాణిజ్యానికి వేగవంతమైన మార్గాలు అందుబాటులోకి రావడం, ఉద్యోగావకాశాల విస్తరణ, పరిశ్రమల స్థాపనకు మద్దతు లభించడం ఖచ్చితంగా ఖమ్మం అభివృద్ధిలో కీలక మలుపు అవుతుంది.





# చివరి గింజ వరకు కొనుగోలు

- హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా చర్యలు
- గన్నీ బ్యాగ్ లు, టార్పాలిన్ కవర్లు అందుబాటు లో పెట్టాలి
- అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా ఉండాలి
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ఖమ్మం, మహా:** యాసంగి సీజన్ లో తెలంగాణ రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి.ఎస్. చౌహాన్ లతో కలిసి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి, కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మన దగ్గర రికార్డ్ స్థాయిలో 57 లక్షల ఎకరాలలో వరి పంట సాగు జరిగిందని, ప్రభుత్వం దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన 48 గంటల్లో రైతులకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని అన్నారు. భారీ స్థాయిలో కొనుగోలు జరుగుతున్నప్పటికీ మీడియాలో సరిగ్గా కవర్ కావడం లేదని అన్నారు. పత్రికలలో వచ్చే నెగటీవ్ వార్తలపై స్పందించాలని, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించాలని అన్నారు. రాబోయే 15 రోజులలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు, రవాణా వాహనాల కొరత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగ్ లు, టార్పాలిన్ కవర్లు అందుబాటు లో పెట్టాలని అన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. 2025, జనవరి 26 తర్వాత మన రాష్ట్రంలో నూతనంగా 1,57,467 రేషన్ కార్డులను పంపిణీ చేశామని, మీసేవ కేంద్రాలు, ప్రజాపాలన కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ధాన్యం పెండింగ్ లో ఉన్నదని, కొనుగోలు సజావుగా పూర్తి చేయాలని, మిల్లర్ల వద్ద తరుగు తీయకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రవాణా కాంట్రాక్టర్ లతో చర్చించి నిర్దేశించిన మేర వాహనాలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రైస్ మిల్లుల వద్ద తరుగు లేకుండా చూడాలని అన్నారు. గన్ని బ్యాగులు సమస్య రాకుండా చూసుకోవాలని, రవాణా సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావు మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కలెక్టర్లు ప్రణాళిక బద్ధంగా యాసంగి పంట కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెగ్యులర్ గా కలెక్టర్లు తనిఖీ చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే చిన్న, చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ప్రతి రోజు జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ పురోగతిపై మీడియాకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కరించి ఆ సమాచారం కూడా రైతులకు మీడియా ద్వారా తెలియ జేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 7 లక్షల 70 వేల 477 మంది రైతుల నుంచి 49 .53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8 వేల 42 కోట్లు మద్దతు ధర క్రింద చెల్లించామని అన్నారు. గతం కంటే అధికంగా ఈ యాసంగి సీజన్ లో మనం ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే 15 నాటికి 2022-23 రబీ సీజన్ లో 25.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 2023-24 రబీ సీజన్ లో 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, 2024-25 రబీలో 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. ప్రతి రోజు అదనపు కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మే నెలాఖరు నాటికి పకడ్బందిగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని అన్నారు. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, ఆర్.టి.ఓ , పోలీస్ అధికారులు సమన్వయంతో ఖాళీగా ఉన్న లారీలను పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలుకు కేటాయించాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాల అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యంనింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. గత ఆరు నెలల కాలంలో రేషన్ తీసుకోక పోవడం, ఇతర రాష్ట్రాలకు చెందిన డూప్లికేట్ బెనిఫిషరీ, చనిపోయిన వారి పేర్లు ఉండటం వంటి వివిధ కారణాల వల్ల భారత ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం 96 వేల 240 రేషన్ కార్డుల పరిధిలోని లక్షా 62 వేల 777 మంది లబ్ధిదారులు అనుమానాస్పదంగా ఉన్నారని, జిల్లాల వారీగా సంబంధిత జాబితా అందించామని, వీటిపై విచారణ చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.